
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 7 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	132
డ్రెస్	192
స్కిన్‌లెస్	220
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.5
కనిష్ఠం	25.0

ఎండవేడికి
మొలకెత్తని విత్తు
- ప్రతాపం చూపుతున్న సూరీడు
- పలుచోట్ల మొలకెత్తని పత్తి విత్తనాలు

6


సభకు హాజరైన ప్రజాప్రతినిధులు

సాగునీటి ప్రాజెక్టులు
పూర్తి చేస్తాం

- ఇరిగేషన్‌కు బీఆర్ఎస్ రూ.2లక్షల కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టులు ఎందుకు పూర్తికాలేదు?
- ఆరునూరైనా మూసీ ప్రక్షాళన
- పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- త్వరలో గుట్టకు పాలకమండలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తిర్మలాపూర్‌లో 'ప్రజాపాలన' సభ సక్సెస్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం జిల్లాలోని తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ, పదేళ్లలో గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.2లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అయితే ఉమ్మడి జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, గంధమల్ల రిజర్వాయర్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. బునాది గాని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వల పునరుద్ధరణ చేపట్టలేదన్నారు. గంధమల్ల రిజర్వాయర్ అంచనాలు తగ్గిస్తూ గత ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. గంధమల్లకు నీరు ఎక్కడి నుంచి ఇస్తారని మాజీ మంత్రి హరీశ్‌రావు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని, నిధులు ఇచ్చినవారు నీరు ఇవ్వలేరా? అని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామన్నారు. ప్రజలు సహకరిస్తే తెలంగాణను పదేళ్లలో ట్రిలియన్ ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, తెలంగాణను జపాన్, సింగపూర్ సరసన నిలుపుతామన్నారు.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వైటీడీ బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. త్వరలోనే యాదగిరిగుట్ట ఆలయానికి కొత్తగా బోర్డు ఏర్పాటవుతుందని ప్రకటించారు. టీటీడీ తరహాలో వైటీడీ కూడా సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తరహాలో ఈ ప్రాంతంలో గొప్ప విద్యా సంస్థలను, యూనివర్సిటీని ఏర్పాటుచేస్తామని చెప్పారు. భక్తుల కోరిక మేరకు పాత సంప్రదాయాలను పునరుద్ధరించామని, గుట్టపైకి ఆటోల నిషేదాన్ని ఎత్తివేసి, ఆటోల ప్రయాణాన్ని కొనసాగించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, 18 నెలల కాలంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. 60కిలోల బంగారంతో స్వామివారి విమాన గోపురాన్ని స్వర్ణమయం చేశామన్నారు. ఎందరో త్యాగధనులు, ఉద్యమకారులు పుట్టిన చైతన్యవంతమైన ప్రాంతంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నిలిచిందన్నారు.

మూసీ ప్రక్షాళన చేసితీరుతాం
ఆరు నూరైనా మూసీ నది ప్రక్షాళన చేసి గోదావరి జలాలతో మూసీని నింపుతామని సీఎం వెల్లడించారు. నవంబరు 8న తన జన్మదినం రోజున మూసీ ప్రక్షాళనకు పాదయాత్ర నిర్వహించి, ఈ ప్రాంత వాసుల బాధలు గమనించానన్నారు. ఆరు నూరైనా, ఎవరు అడ్డం పడినా తొక్కుకుంటూ వెళ్లి మూసీకి పునరుజ్జీవం చేసి తీరుతామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలను ప్రశ్నిస్తున్న.. పక్క రాష్ట్రాల్లో సబర్మతి, గంగా, యమునా నదులకు పునరుజ్జీవం చేస్తే..

మిగతా 7వ పేజీలో...


సభకు హాజరైన ప్రజలు


అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

ఆలేరు చరిత్రలో అరుదైన ఘటన

ఆలేరు చరిత్రలో ఒకే రోజు, ఒకే దగ్గర రూ.1,500 కోట్లతో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలతో సీఎం శంకుస్థాపన చేయడం ఇది అరుదైన సంఘటన అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. స్వతంత్ర్య భారత దేశంలో 80శాతం పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం ఇచ్చిన రాష్ట్రం అది తెలంగాణ ఒక్కటేనని అన్నారు.

- భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తాం

అందరికీ అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు.

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

18 నెలల్లో చేసి చూపించాం

ఆలేరు నియోజకవర్గంలో గత పదేళ్లలో చేయని అభివృద్ధిని తమ ప్రభుత్వ హయాంలో 18 నెలల్లోనే చేసి చూపించామని, ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మంత్రులు సహకరించి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1,500కోట్ల నిదులు మంజూరు చేసి, ఆ పనులు ప్రారంభోత్సవానికి వచ్చారని, ఈసందర్భంగా అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మిగులు రాష్ట్రానికి కేసీఆర్ సీఎం అయితే, అప్పుల రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారన్నారు. అయినా సరే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ రానున్న రోజుల్లో దశల వారీగా అమలు చేస్తామన్నారు.

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

- (ఆంధ్రజ్యోతి, తుర్కపల్లి)



ప్రార్థనలకు సిద్ధమైన నల్లగొండ ఈద్గా



నేడు బక్రీద్
సామూహిక ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబు
నల్లగొండ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం నిర్వహించనున్నారు. ముస్లింల సామూహిక ప్రార్థనలకు మునుగోడు రోడ్డులోని ఈద్గా వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. ఆ ప్రాంతమంతా శుభ్రం చేసి చదును చేశారు. తాగునీరు, ఇతర వసతులు కల్పించారు. షామియానాలు ఏర్పాటుచేశారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు రానుండటంతో పోలీసు భద్రతను ఏర్పాటు చేయనున్నారు. మునుగోడు రోడ్డులోని ఈద్గా వద్ద శనివారం ఉదయం 8.30గంటలకు సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి.

ఖుర్బానీ.. మార్కెట్‌లో గొర్రెలకు గిరాకీ

బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు స్తోమతకు తగినట్టుగా ఖుర్బాని ఇస్తారు. గొర్రె, మేక, లేదా ఒంటె (ఖుర్బాని) మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి అందులో మొదటి భాగం పేదలకు, రెండో భాగం బంధువులకు, మూడో భాగం ఖుర్బాని ఇచ్చే వారు తీసుకుంటారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు ఇంటికి చేరాక ఖుర్బాని ఇస్తారు. అయితే ఖుర్బాని నేపథ్యంలో జిల్లా కేంద్రంలో గొర్రెల విక్రయాలు ముమ్మరంగా సాగాయి. పట్టణంలోని దేవరకొండరోడ్డు, మాన్యంచెల్క, ప్రకాశంబజార్ తదితర ప్రాంతాల్లో గొర్రెల విక్రయాలు అధికంగా జరిగాయి. వ్యాపారులు గొర్రెల మందలను మార్కెట్‌కు గుంపులుగా తీసుకొచ్చి విక్రయించారు. సైజును బట్టి ఒక్కో గొర్రెకు రూ.10వేల నుంచి రూ.14వేల వరకు విక్రయించారు. గొర్రెల విక్రయాలు, ముస్లింల పండుగ షాపింగ్‌తో పట్టణంలోని పలు ప్రాంతాల్లో సందడి నెలకొంది.

కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్‌లో పలు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. గత నెల మొదటి వారంలో ప్రారంభమైన విశిష్ట గుర్తింపు కార్డు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. భూములు ఉన్న గ్రామాల్లో ఆధార్‌కార్డ్ చిరునామా లేకుంటే ఆ వివరాల ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. దీంతో వ్యవసాయశాఖ అధికారులకు పాస్‌బుక్‌తో పాటు ఆధార్‌కార్డు, చిరునామా ఇతర వివరాల నమోదు కష్టతరంగా మారింది. రిజిస్ట్రేషన్‌లో తలెత్తుతున్న సమస్యల కారణంగా రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)


వార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు రైతు వేదికలో వివరాలు నమోదుచేస్తున్న వ్యవసాయాధికారులు

20 శాతమే పూర్తి

- ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్‌లో సాంకేతిక సమస్యలు
- వివరాల నమోదుకు ఇబ్బందులు
- ఆధార్ అడ్రస్ ఇతర ప్రాంతాల్లో ఉంటే తిరస్కరణ
- ఇప్పటివరకు 2.15లక్ష మంది రైతుల వివరాలే నమోదు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు జారీచేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. తొలుత నెల రోజుల పాటు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపట్టనుండగా, ఆ తరువాత మీ-సేవా కేంద్రాలు, ఏజెన్సీల ద్వారా దీన్ని కొనసాగించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు ఈ గుర్తింపు కార్డు ఇకపై ప్రామాణికం కానుంది. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 140కి పైగా రైతువేదికల్లో ఈ కార్యక్రమం నెలరోజుల కు పైగా కొనసాగనుంది. ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన పట్టాదారు పాస్‌పుస్తకంలోని భూ యాజమాన్య వివరాల నమోదు ద్వారా రైతులకు 11 అంకెలతో ఉన్న గుర్తింపు కార్డును కేటాయిస్తారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలైన పీఎం కిసాన్‌తో పాటు పంటలబీమా, మౌలిక సదుపాయాల కల్పన వంటి పథకాలకు ఈ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారు. ఇప్పటి వరకు సరైన ధ్రువీకరణ పత్రాల వివరాల నమోదులేకపోవడంతో రైతులకు సకాలంలో కేంద్ర పథకాలు అందడం లేదని గుర్తించిన ప్రభుత్వం విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10.27లక్షలకు పైగా రైతులు
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10,27,532 మంది రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5.40లక్షలు, యాదాద్రి జిల్లాలో 1,57,206మంది, సూర్యాపేట జిల్లాలో 3,30,326మంది రైతులు ఉన్నారు. వీరందరికీ విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉంది. అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ కార్యక్రమంపై శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. విశిష్ట గుర్తింపు కార్డు జారీకి భూ యాజమాన్య పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో మండల వ్యవసాయ అధికారులు లేదా మండల వ్యవసాయ...

- మిగతా 7వ పేజీలో...

సాంకేతిక సమస్యలు పరిష్కరించాం

భూములు ఒక చోట, ఆధార్ కార్డు అడ్రస్ మరో చోట ఉండటంతో సాంకేతిక సమస్యలు ఏర్పడిన విషయం వాస్తవమే. అయితే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశాం. కొన్ని టెక్నికల్ సమస్యలను పరిష్కరించడంతో మళ్లీ రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమయ్యాయి. రైతులు విధిగా ఈ విశిష్ట సంఖ్యకు పేర్లను నమోదు చేసుకోవాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేయడం జరుగుతోంది. ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు కేటాయించడం జరుగుతుంది. ఈ గుర్తింపు కార్డు కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం అవుతుంది.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం
నేడు బోనాల సమర్పణ

అమ్మవారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

కనగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవ, లలిత సహస్రనామార్చన, బాలబోగ నివేదన నిర్వహించారు. ఆలయాన్ని తోరణాలు, అమ్మవారిని, జమదగ్ని మహర్షి స్వామివారిని బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి వేదికపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణాన్ని యాజ్ఞికులు డేరం భాస్కర శర్మ, అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌చార్యులు, ఉమామహేష్, దామోదర్‌రావు నిర్వహించారు. అమ్మవారికి కల్యాణ తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఎండోమెంట్ ఏసీ భాస్కర్, చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి దంపతులు, ఈవో జయరామయ్య అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించి పులకించారు. భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. కల్యాణం సందర్భంగా ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ విష్ణుమూర్తి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అమ్మవారి కల్యాణం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాగా, శనివారం దర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్థులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. కార్యక్రమాల్లో తహసీల్దారు పద్మ, డీటీ పార్వతమ్మ, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మధు, కాంగ్రెస్ నాయకులు గుమ్ముల మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, పెంటయ్య, నల్లబోతు శ్రీను, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, దేప సరిత, ఆలయ సిబ్బంది జి.చంద్రయ్య, నాగేశ్వర్‌రావు, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల
నమోదును పెంచాలి
డీఈవో బొల్లారం భిక్షపతి

దర్వేశిపురంలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న డీఈవో భిక్షపతి

కనగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని దర్వేశిపురం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తోందని ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వి.పద్మ, హెచ్ఎం విజయలక్ష్మి, రాంబాబు, కార్యదర్శి డి.పద్మ, పాల్గొన్నారు.

'శ్రామికవర్గాన్ని అణగదొక్కేందుకు బీజేపీ కుట్ర'
మర్రిగూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పారిశ్రామికవర్గాలకు కొమ్ముకాస్తూ శ్రామికవర్గాలను అణగదొక్కే కుట్ర చేస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభ, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను తుదముట్టిస్తోందని, ఎన్‌కౌంటర్ మృతదేహాలను కనీసం కుటుంబ సభ్యులకు అప్పజెప్పకపోవడం బాధాకరమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అవినీతికి పాల్పడి ప్రజాధనాన్ని దోచుకుతిన్నదని ఆరోపించారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకే కేసీఆర్, కవిత డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కాగా, పార్టీలో భిన్నాభిప్రాయాల మేరకు మండల కార్యదర్శి ఎన్నికను వాయిదా వేశారు. సమావేశంలో బూడిద సురేష్, ఆకుల రఘుమయ్య, అంజయ్య, నజీర్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా
పూర్తి చేయాలి
కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), గుర్రంపోడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం గుడిపల్లి మండలంలోని కేశంనేనిపల్లి, గుర్రంపోడు మండలంలోని జూనూతులలో ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేశంనేనిపల్లిలో లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎంత ఖర్చయింది? సామగ్రి ఎక్కడి నుంచి తెస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కేశంనేనిపల్లిలో పైలెట్ ప్రాజెక్టుగా 98 ఇళ్లు మంజూరు కాగా, అందులో 42 మంది బేస్‌మెంట్ లెవెల్ పూర్తిచేయడంతో ఐదుగురికి రూ.లక్ష వారి బ్యాంక్ ఖాతాలో జమైందని, మిగిలిన వారికి త్వరలో డబ్బు జమ అవుతుందని తెలిపారు. మిగిలిన 56 మంది లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని ఘనిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూభారతి సదస్సుకు హాజరై మాట్లాడారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో రమణారెడ్డి, డీఈ నగేందర్, ఎంపీడీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు
అదనపు కలెక్టర్ శ్రీనివాస్

భీమారం రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కేతేపల్లి, శాలిగౌరారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రైతుల భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కేతేపల్లి మండలం భీమారం, శాలిగౌరారం మండలం వంగమర్తిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూభారతి చట్టంతో అన్ని రకాల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

మిస్సింగ్ సర్వే నెంబర్లు, మరొకరి పేరున భూమి నమోదవడం వంటి సమస్యలు ఉంటే రైతులు నిర్ణీత ఫార్మాట్‌లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో కేతేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ సత్తార్, పంచాయతీ కార్యదర్శి అనిల్, రెవెన్యూ సిబ్బంది ఆనంద్, అశ్విని, సంధ్య, విజయ్, కాంగ్రెస్ నాయకులు బడుగుల నరేందర్, శాలిగౌరారం తహసీల్దార్ పి.యాదగిరి, ఆర్ఐ మహ్మద్ అజహారుద్దీన్, సిబ్బంది పద్మ, రాంరెడ్డి, రాంబాబు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎండవేడికి మొలకెత్తని విత్తు

● ప్రతాపం చూపుతున్న సూరీడు

● పలుచోట్ల మొలకెత్తని పత్తి విత్తనాలు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

నేటితో రోహిణి కార్తె ముగుస్తుంది. రేపటి(ఆదివారం) నుంచి మృగశిర కార్తె మొదలవుతుంది. వాతావరణ శాస్త్రవేత్తలు ఈ సారి వారం, 10 రోజులు ముందుగానే రుతుపవాలు వస్తాయని, కేరళను తాకుతున్నాయని చెప్పారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో కత్తెర కార్తె చివరలో, రోహిణి కార్తె మొదటి పాదంలో వర్షాలు కురిశాయి. రోహిణ కార్తె బలమైనదని, ఈ కార్తెలో పంటలు వేస్తే చేను బలంగా ఎదుగుతుందని, దిగుబడి ఎక్కువ వస్తుందన్న ఆశతో పలువురు రైతులు పత్తి, కంది విత్తనాలు విత్తారు. కత్తెర చివరి వర్షాలకు విత్తిన విత్తనాలు మొలకెత్తాయి. వారం, 10 రోజులుగా వరుణుడు ముఖం చాటేయగా, సూరీడు తన ప్రతాపం చూపుతున్నాడు. రోహిణిలో విత్తిన విత్తనాలు ఎండలకు మొలకెత్తక భూమిలోనే మగ్గిపోతున్నాయి. కొందరు రైతులు పొడిదుక్కిలో విత్తారు. అవి కూడా మొలకెత్తుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



మోటకొండూరు మండలం చందేపల్లిలో ఎండలకు మొలకెత్తని పత్తి విత్తనాలు

భిన్న వాతావరణంతో

గతంలో వర్షం కురిస్తే రాష్ట్రమంతటనో, లేదంటే కనీసం జిల్లా అంతటనో కురిసేది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఇప్పుడు ఓ బజారులో కురిస్తే మరో బజారులో కురియని స్థితి నెలకొంది. ఈ నెల 4న యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని మోత్కూరు పట్టణంలో ఒక చినుకు రాలలేదు. జామచెట్లబావి వద్ద వరదలు సాగేంత వర్షం కురిసింది. ఈ నెల 5న అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామంలో వర్షం కురియగా సమీపంలోని గట్టుసింగారంలో వర్షం కురియలేదు. ఇలాంటి వాతావరణ పరిస్థితులతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

చందేపల్లిలో 500 ఎకరాల్లో..

మోటకొండూరు మండలం చందేపల్లి గ్రామంలో రైతులు సుమారు 600 ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తినట్లు చెబుతున్నారు. సుమారు 500 ఎకరాల్లో విత్తనాలు దుక్కిలోనే మగ్గిపోయాయని రైతులు వాపోతున్నారు. దీంతో మళ్లీ విత్తనాలు విత్తేందుకు దున్నకాలకు రూ.1000, అచ్చులు తోలడానికి రూ.1000, విత్తనాలు విత్తేందుకు కూలీలకు కూలి రూ.1000, విత్తనాల ప్యాకెట్ రూ.900 చొప్పున మూడు ప్యాకెట్లకు రూ.2,700 ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేయడం కష్టంగా మారిందంటున్నారు. మోత్కూరు, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, వలిగొండ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో విత్తిన పత్తి విత్తనాలు, కందులు మొలకెత్తలేదని చెబుతున్నారు.

అమ్మో.. ఎండ



రెండు నెలల వేసవి కాలంలో మే నెల అత్యంత వేడిగా ఉంటుంది. అయితే ఈ ఏడాది మొదటి రెండు వారాలు నామమాత్రంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం, రోహిణి కార్తె మొదట్లో తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురియడంతో జూన్ ప్రారంభానికి ముందే ఇక ఎండవేడికి సెలవు ప్రకటించినట్లు భావించారు. కానీ రెండు, మూడు రోజులుగా విపరీతమైన ఎండతో పాటు ఉక్కపోత జనాలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రజలపై సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉదయం 10 గంటలకే ఎండ ప్రతాపానికి వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తరుణంలో రేపటి నుంచి ప్రారంభమయ్యే మృగశిర కార్తె కనికరిస్తుందని ఎదురు చూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

బూరుగడ్డ ఆలయ స్థానాచార్య శ్రీనివాసాచార్యులు మృతి

హుజూర్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ వేణు గోపాలస్వామి ఆలయ స్థానాచార్యులు, సంగీత విద్వాంసులు ముడుంబై శ్రీనివాసాచార్యులు(82) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. గత 60 ఏళ్లుగా బూరుగడ్డలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ స్థానాచార్యులుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆలయ అభివృద్ధిలో శ్రీనివాసాచార్యులు ప్రముఖపాత్ర పోషించారు. ఆయన సంగీత విద్వాంసుడు. ఎంతోమంది విద్యార్థులకు సంగీతం నేర్పించారు. ఆయన కుమార్తెలు ఇద్దరు కూడా తండ్రి శ్రీనివాసాచార్యుల వద్దనే సంగీతం నేర్చుకుని అమెరికాలో అనేక ప్రదర్శనలు నిర్వహించి సంగీత కుటుంబరంగా ప్రసిద్ధిచెందారు.



శ్రీనివాసాచార్యులు (ఫైల్)

ఆయన మృతికి ఆలయ కమిటీ ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాధిక, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఈడ్పుగంటి సుబ్బారావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కాగా హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం శ్రీనివాసాచార్యులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నాలుగు రోజుల్లో 9,163 అర్జీలు

● 'భూభారతి'కి దరఖాస్తుల వెల్లువ

● సగం వరకు సాదాబైనామాలవే...

వివాదాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టాన్ని జూలై నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ చట్టంలో అధికారాల వికేంద్రీకరణ ద్వారా భూసమస్యలకు పరిష్కారం లభించనుందని రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ రైతుల నుంచి భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రైతుల నుంచి శుక్రవారం నాటికి 9,163 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

భూభారతి చట్టంతో రెవెన్యూ సమస్యలకు చెక్కుపడే అవకాశం ఉందని అధికారులు రెవెన్యూ సదస్సుల్లో పేర్కొంటున్నారు. జిల్లాలోని 22 మండలాల్లో జోరుగా రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. భూసమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులను సదస్సులో అందజేస్తున్నారు. దరఖాస్తు ఫారాలు కూడా ప్రభుత్వమే రైతులకు ఇచ్చి ఎలా నింపాలో కూడా తెలియజేస్తోంది. హెల్ప్‌డెస్క్‌లను కూడా ఏర్పాటుచేసింది. రాష్ట్రవ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గరిడేపల్లి మండలంలో 11 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే సదస్సులు నిర్వహించారు. ఆ మండలంలో సదస్సులు పూర్తయ్యాయి. ఈ నెల 3 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా సదస్సులు జరగనున్నాయి. భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారమే సమస్యలు పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు ఇప్పటికే మార్గనిర్దేశం చేశారు. ప్రతీ రైతు నుంచి దరఖాస్తు స్వీకరించిన తర్వాత రశీదు కూడా అందజేస్తున్నారు.

సాదాబైనామాలే ప్రధాన సమస్య

2017లో అప్పటి ప్రభుత్వం సాదాబైనామాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించింది. అనేకమంది దరఖాస్తు చేసుకుంటే కొద్దిమందికి మాత్రమే ఇచ్చారు. చాలామంది రైతులకు పాస్‌బుక్‌లు రాలేదు. 2020లోనూ అనేకమంది రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం భూభారతి చట్టం కింద ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 9,163 దరఖాస్తులు వచ్చాయి. అందులో సగం వరకు సాదాబైనామాలకు పాస్‌పుస్తకాలు కావాలన్నవే ఉన్నాయి. పాస్‌బుక్‌లో పేర్లు తప్పుగా ఉన్నాయని అనేక దరఖాస్తులు వచ్చాయి. అసైన్డ్ భూమికి పట్టాలు ఇవ్వాలని కూడా పలువురు దరఖాస్తు చేసుకున్నారు.



జాన్‌పహాడ్ రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కమలాకర్

భూభారతి చట్టంతో ప్రయోజనాలు

భూభారతి చట్టం కింద ఇంటి యజమాని చనిపోతే వారి కుటుంబ సభ్యులందరూ రిజిస్ట్రేషన్‌కు హాజరుకావాలి. పాస్ పుస్తకంలో పేర్లు తప్పుగా ఉంటే సరి చేసే అవకాశం ఉంది. అసైన్డ్ భూమికి పట్టాలు ఇచ్చే ఏర్పాటుచేస్తున్నారు.

ఆధార్ కార్డు మాదిరిగా ప్రతీ వ్యవసాయ భూమి యజమానికి అగ్రికల్చర్ ఐడీ కార్డు అందజేస్తారు. ఈ కార్డును ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే వారి భూమి వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. అంతేకాక డ్రోన్లతో డిజిటల్ సర్వే చేసి రైతుల భూముల హద్దులు గుర్తిస్తారు. అవసరమైతే భూమి విస్తీర్ణ మ్యాప్ కూడా పాస్‌పుస్తకంలో పొందుపర్చనున్నారు. ప్రస్తుతం ఈ నెల 20వరకు దరఖాస్తులు స్వీకరించి దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపర్చి ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కార మార్గాలను అన్వేషించనున్నారు. స్థానిక అధికారుల స్థాయిలోనే చాలా సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

● **ధరణిలో లోపాలు**

గత ప్రభుత్వం అమలుచేసిన ధరణిలో అనేక లోపాలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఉదాహరణకు కుటుంబ యజమాని చనిపోతే కుటుంబ సభ్యులకు తెలియకుండా ఎవరో ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. కుటుంబ సభ్యులందరికీ హక్కు ఉన్నప్పటికీ ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికే రిజిస్ట్రేషన్ జరిగేది. కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉన్నా ఎవరో ఒకరు తొందరపడి రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. దీంతో రెవెన్యూ అధికారులకు కాసుల పంట కురిసేది. ఎకరానికి ఇంతా అని ముడుపులు వసూలు చేసే వారు. కొంతమంది కింది స్థాయి ఉద్యోగులకు కూడా లోపాలు ఆదాయానికి వనరులుగా మారాయి. ఇక భూమి ఉన్నా హైదరాబాద్‌లో స్థిరపడిన వారు రాకపోవడంతో వీఆర్వోలతో పట్టాలు చేసుకున్న వారు కూడా అనేకమంది ఉన్నారు. ఒకరి సర్వే నెంబర్లు మరోకరు వేసుకొని భూములను పట్టాలు చేసుకున్నారు. కబ్జాలో ఉన్న రైతు అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఆ రైతుతో మాట్లాడుకోవాలనే సందర్భాలూ సైతం ఉన్నాయి. కొంతమంది రైతులు వాగ్వాదానికి, అవసరమైతే ఘర్షణలు దిగిన సంఘటనలు ఉన్నాయి. ఇతర రైతుల భూములను పట్టాలు చేసుకున్న వారు వేలిముద్రలు వేస్తేనే ఆ రైతులకు పట్టాలయ్యేవి. ధరణిలో లోపాలను చెక్ పెట్టేందుకు 2025భూభారతి చట్టాన్ని ఈ ప్రభుత్వం తీసుకువచ్చింది.

అక్రమంగా మట్టి తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామంలో బీ.వెల్లెంల ప్రాజెక్టుకు సంబంధించిన కాలువ కట్టపై ఉన్న మట్టిని అక్రమంగా తొలగిస్తున్న విషయంపై ఇరిగేషన్ సబ్ డివిజన్ ఈఈ ఎం. శ్రీనివాసులు నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మట్టి తరలింపుపై 'ఆంధ్రజ్యోతి' మినీలో ఈ నెల 5వ తేదీన 'కాల్వ మట్టి కాజేస్తున్నారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ డిప్యూటీ ఈఈతో పాటు పలువురు అధికారులు కాల్వ పరిసరాలను పరిశీలించినట్లు ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ నెల 1, 2వ తేదీల్లోనే తాము పరిశీలన చేసిన సందర్భంగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు గమనించామన్నారు. 2వ తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అక్రమాలను నిలిపివేయడంతో పాటు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరామన్నారు. తాము నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు.

తక్కువకు ఇల్లు ఇప్పిస్తామని మోసం

నూతనకల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు ఇల్లు ఇప్పిస్తామని ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా నూతనకల్ ట్రైనీ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నూతనకల్ మండలం మాచనపల్లి గ్రామానికి చెందిన బ్రహ్మాండ్లపల్లి ప్రభాకర్‌కు ఆన్‌లైన్‌లో పరిచయమైన ఇద్దరు వ్యక్తులు తాము బ్యాంక్ రికవరీ ఏజెంట్లమని నమ్మబలికారు. బ్యాంక్ వేలంలో ఉన్న ఇంటిని తక్కువ ధరకు ఇప్పిస్తామన్నారు. వారి మాటలు నమ్మిన ప్రభాకర్‌కు ఇల్లు ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఖర్చులు చెల్లించాలని చెప్పడంతో రూ.8,66,500 వారికి పంపించాడు. డబ్బులు తీసుకున్న తర్వాత వారు తప్పించుకుని తిరుగుతుండడంతో వారిపై అనుమానం వచ్చి బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ట్రైనీ ఎస్‌ఐ తెలిపారు. ఆ మేరకు దూపల్లి సతీష్, మహమ్మద్ ఫరూక్ అలీపై సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అపరిచిత వ్యక్తులు చేసిన ఫోన్‌కాల్స్‌కు ప్రజలు స్పందించవద్దని ట్రైనీ ఎస్‌ఐ కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు మృతదేహం

పెద్దవూర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందింది. బట్టుగూడెం గ్రామస్థులు, బాధిత రైతు చెన్ను సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం కోడె ఎద్దు, ఆవులు మేత మేయడానికి పొలానికి వెళ్లాయి. అందులోని కోడె ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తూ విద్యుత్ వైర్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

బీమనపల్లిలో పాడి గేదె...

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి): నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. స్థానికుల వివరాలు, బాధితుడు పిల్లి ఆంజనేయులు తెలిసిన వివరాల ప్రకారం.. రూ.లక్ష విలువైన పాడి గేదెను మూడేళ్ల కిందట కొనుగోలు చేశాడు. దానిని షెడ్‌లో కట్టి ఉంచేవాడు. శుక్రవారం రోజు మాదిరిగానే షెడ్‌లో కట్టివేయగా గేదె కొమ్ములకు షెడ్‌కు వచ్చే విద్యుత్ తీగలు చుట్టుకొని విద్యుదాఘాతానికి గురై పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. జీవనోపాధి కోసం కొనుగోలు చేసిన గేదె మృతి చెందడంతో ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

నల్లగొండ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి నివారణ, రక్షణ చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిదేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు తగ్గించడానికి అవలంబించాల్సిన విధానాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి జిల్లా రోడ్డు సేఫ్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రహదారులపై ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా నివారించడం కోసం పోలీసు, రోడ్లు, భవనాలు, ఎక్సైజ్, ఆర్టీవో, ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. నల్లగొండ జిల్లా గుండా వెళ్లే జాతీయ రహదారులతో పాటు నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించామని, వీటిలో అత్యధికంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే జాతీయ రహదారి(65 నెంబరు)పై ఉన్నాయన్నారు. ఆయా చోట్ల ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభమైతున్న క్రమంలో ప్రైవేట్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాలన్నారు. అన్ని శాఖలు కలిసి ఒక్క ప్రాణం కూడా పోకుండా చూడాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్నిశాఖలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ రాము, డీటీఆర్బీ రిటైర్ సీఐ అంజయ్య, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, పక్కన కలెక్టర్ ఇలా త్రిపాఠి

శునకం కిడ్నీరాళ్ల తొలగింపు

హుజూర్‌నగర్ , జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో శుక్రవారం ఓ కుక్కకు కిడ్నీ ఆపరేషన్ చేసి రాళ్లను తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వేపలసింగారం గ్రామానికి చెందిన పల్లె భాస్కర్‌రెడ్డి ల్యాబ్రాడర్ జాతికి చెందిన కుక్క లియోను పెంచుకుంటున్నాడు. కాగా శుక్రవారం పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, సీనియర్ సర్జన్ రూప్‌కుమార్, అసిస్టెంట్ సర్జన్ కొణతం శ్రీనివాసరెడ్డిలు సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసి 12, 15, 20 ఎంఎం సైజు గల 20 రాళ్లను తొలగించారు. అనంతరం కుక్క లియో ఆరోగ్యంగా స్థిరంగా ఉందని పశువైద్యులు తెలిపారు. శస్త్రచికిత్సలో పశువైద్యులు వీరారెడ్డి, శైలజ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



కుక్కకు చికిత్స చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు, ఇతర వైద్యులు

గుమ్మడవెల్లిలో 10 మేకల చోరీ

కొండమల్లేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో 10 మేకలు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ అజ్మీర రమేష్, బాధితురాలు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎస్‌కే షరీఫ్‌బీ మేకలను కాస్తూ జీవనం సాగిస్తోంది.రోజు మాదిరిగానే గురువారం తన మేకలను పొలానికి మేత కోసం తీసుకెళ్లింది. సాయంత్రం ఊరిలో ఉన్న మేకల దొడ్డిలో 50 మేకలను కట్టేసి ఇంట్లో నిద్రించింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ.లక్ష విలువైన 8 మేకలు, రెండు పోతులను ఎత్తుకెళ్లినట్లు శుక్రవారం గుర్తించి ఫిర్యాదు చేసినట్లు, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సబ్ కలెక్టర్ వసతిగృహంలో అగ్నిప్రమాదం

మిర్యాలగూడ అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ వసతిగృహంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపులో గల వసతిగృహంలో సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి ఓ గదిలో వ్యాపించాయి. ఈ ప్రమాదంలో గదిలోని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సబ్ కలెక్టర్ వసతిగృహం వద్దకు చేరుకున్నారు. అప్పటికే గదిలో పొగ కమ్ముకొని వ్యాపిస్తున్న అగ్నికీలలను అదుపులోకి తెచ్చేందుకు కార్బన్ డైయాక్సైడ్ (సీవో2) ఉపయోగించారు. అప్పటికే గదిలోని కబోర్డులు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాలిపోయిన కబోర్డులో విలువైన పత్రాలేవి లేవు. ఈ ప్రమాదంలో వ్యక్తిగత కార్యాలయంలోని కుర్చీలు, టేబుళ్లు, ఏయిర్ కండీషన్, కంప్యూటర్ సామగ్రి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో భారీ నష్టం జరగలేదు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల విలువైన ఫరిచర్ దగ్ధమైనట్లు అగ్నిమాపక సిబ్బంది గుర్తించారు. ఆ సమయంలో సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ విధుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఈ సంఘటనపై సబ్‌కలెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ సోమనర్సయ్య తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఏఎస్పీ మౌనిక

డిండి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు. శుక్రవారం డిండి మండల పరిధిలోని దాసరినెమలిపూర్‌లో నకిలీవిత్తనాలు, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతులకు మాత్రమే వివాహాలు చేయాలని నిబంధనలకు విరుద్ధంగా యుక్త వయస్సు రాని వారికి వివాహాలు చేయవద్దన్నారు. అలా చేయడం ద్వారా తల్లికి, పుట్టబోయే బిడ్డకు ఇబ్బంది కలుగుతుందన్నారు. లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా ఇసుకతో పాటు అక్రమ వ్యాపారాలు నిర్వహించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డిండి సీఐ సురేష్, ఎస్‌ఐ బోదాసు రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

క్రీడాపోటీల్లో గెలుపు, ఓటములు సహజం




హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన వరంగల్ బాలికల జట్టు, కరీంనగర్ బాలుర జట్లకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నకిరేకల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమి చెందిన వారు నిరుత్సాహపడవద్దని నల్లగొండ జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కే నర్సిరెడ్డి అన్నారు. నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల ముగింపులో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో గెలుపొందిన వరంగల్ బాలికల జట్టు, బాలుర విభాగంలో కరీంనగర్ జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. మారుమూల గ్రామమైన మంగళపల్లిలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో అన్నిజిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఉస్మాన్, చింతకాయల పుల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్రా వీరారెడ్డి, నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ లచ్చిరెడ్డి, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి సీఈవో గోనారెడ్డి, బీ ప్రకాష్‌రావు, మునీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సన్నబియ్యం ఇచ్చిన ఘనత తెలంగాణదే

● భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తుర్కపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆలేరు చరిత్రలో ఒకే రోజు ఒకే దగ్గర వెయ్యి కోట్లతో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలతో సీఎం శంకుస్థాపన చేయడం రాష్ట్రంలోనే ఇది అరుదైన సంఘటన . స్వతంత్ర భారత దేశంలో 80శాతం పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం ఇచ్చిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదే అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఆయన మాట్లాడారు. సన్నబియ్యం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 13వేల కోట్ల రూపాయలు వెచ్చించి అర్హులైన ప్రతీ నిరుపేదకు 6కిలోల చొప్పున సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోందన్నారు. పేదలకు సన్నబియ్యం పంపిణీతో పేదలు కడుపునిండా రెండు పూటలా తింటున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని 80నుంచి 90శాతం మంది తినలేదని ఆ బియ్యం రీసైక్లింగ్ అయ్యాయే తప్ప పేదలకు ఉపయోగపడలేదన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న గంధమల్ల చెరువును రూ.5.47 కోట్లతో 1.4 టీఎంసీలతో రిజర్వాయర్‌గా చేపడుతున్నామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 9.8 టీఎంసీలు, 4.5 టీఎంసీలతో గంధమల్ల రిజర్వాయర్‌ను చేస్తామని కాలయాపన చేస్తున్నారే తప్ప రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ఇక్కడ ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఎన్ని అడ్డంకులు అవాంతరాలు సృష్టించినా గంధమల్ల రిజర్వాయర్‌ను నిర్మించి తీరుతామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రతీ ఇరిగేషన్ పనిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం కూలిపోయాయని ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి జలాశయంలో నీటిని పెంచి గంధమల్లకు గోదావరి జలాలు అందించి ఈ ప్రాంతానికి సాగు జలాలు అందిస్తామన్నారు. రాబోయే కాలంలో దేశంలో ఎక్కడా లేని పథకాలను అందజేస్తామని కలిసికట్టుగా పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో ఉత్తమ్ నవ్వుల్.. పువ్వుల్..

ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తాం: మంత్రి కోమటిరెడ్డి

అందరికీ అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని తమ ప్రభుత్వంలో ప్రజలకు చెప్పించే చేస్తాం.. చేసేదే చెబుతామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత అభివృద్ధి అన్ని రంగాల్లో కుంటు పడిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిరుపేదలకు ఆలేరు నియోజకవర్గంలో వంద డబుల్ బెడ్ రూం ఇళ్లు కూడా కట్టివ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన 18 నెలల్లోనే అరుహలైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, లబ్ధిదారులందరూ ఆయా గ్రామాల్లో నిర్మాణ పనులకు ముగ్గులు పోసి, పునాదులు పోసుకుంటున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకాలు అందజేశామన్నారు.

18 నెలల్లోనే చేసి చూపించాం: ప్రభుత్వ విప్

ఆలేరు నియోజకవర్గంలో గత పదేళ్లలో అభివృద్ధిని తమ ప్రభుత్వం 18 నెలల్లోనే ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన ప్రజాపాలన సభలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర్ రాజనర్సింహ, తదితర మంత్రుల సహకారంతో ఆలేరు నియోజకవర్గంలో మంత్రులు సహకరించి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సుమారు 15వేల కోట్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, ఆ పనుల ప్రారంభోత్సవానికి రావడం పట్ల సభ వేదికపై అభినందనలు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తుర్కపల్లిలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని ఆలేరును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని వందేళ్ల క్రితం నిర్మించి, శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మదర్ డెయిరీ ఈ ప్రాంత రైతులకు జీవనాధారమైన మదర్ డెయిరీ ప్రస్తుతం కష్టాల్లో ఉందని, ఈ మదర్ డెయిరీ విజయడెయిలో భాగమే కాబట్టి మదర్‌డెయిరీకి ప్రభుత్వం నిధులిచ్చి ఆదుకోవాలని సభలో సీఎంను కోరారు. అంతే కాకుండా ఆలేరు నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలను సభలో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం సభ విజయవంతానికి కృషి చేసిన జిల్లా ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హామీలన్నీ అమలు చేస్తాం: ఎంపీ చామల

రాబోయే రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మిగులు రాష్ట్రానికి కేసీఆర్ సీఎం అయితే అప్పుల రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాడన్నారు. 10 సంవత్సరాల పాలన నచ్చకపోవడంతోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. ప్రజల అభీష్టం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన నిర్వహిస్తున్నాడన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ దశలవారీగా అమలు చేస్తామన్నారు. తమ ప్రభుత్వం 21వేల కోట్లతో రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

(5వ పేజీ తరువాయి)

మేం మూసీ ప్రక్షాళన చేయడం తప్పా.. అని విమర్శించారు. ఈ ప్రాంత బిడ్డలు మూసీతో విషమ పరిస్థితిని ఎదుర్కోవాల్సిందేనా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు.

దేశంలోనే మొదటిసారి కులగణన

దేశంలో వందేళ్లలో ఎవరు చేయని విధంగా మొదటసారిగా కులగణన చేపట్టి, రాష్ట్రంలో 56.36శాతం బీసీలు ఉన్నారని లెక్కలు తీశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ఉచిత స్సుతో పాటు 600 బస్సులు స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇచ్చి వారు వ్యాపార రంగాల్లో రాణించేలా చేశామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, పాఠశాల యూనిఫాం కుట్టే బాధ్యతను మహిళలకు అప్పగించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గతంలోనూ పేదోళ్లు ఇందిరమ్మ ఇచ్చిన ఇళ్లల్లోనే ఉన్నారని గుర్తు చేశారు. ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తిచేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాలు ఒకే చోట చదువుకునేలా 100 నియోజకవర్గాల్లో రూ.20వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలో 60వేల ఉద్యోగులు ఇచ్చామని, ప్రైవేట్ రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించామన్నారు. సీఎం ప్రసంగించే ముందు కాంగ్రెస్ కార్యకర్తలు జై కాంగ్రెస్.. జై రేవంతన్న అంటూ నినాదాలు చేశారు. దీంతో సీఎం స్పందిస్తూ మీ నినాదాలు కేసీఆర్ ఫాంహౌస్ వరకు వినపడాలని పిలుపునిచ్చారు.

స్పృహ తప్పి పడిపోయిన మహిళ

తుర్కపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిర్మలాపూర్ సీఎం సభా ప్రాంగణం దగ్గరలో ఓ మహిళా స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే గుర్తించిన పోలీసులు, వైద్య సిబ్బంది చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీలో వైద్యులు ఆ మహిళకు ప్రాథమిక చికిత్స నిర్వహించి భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆమెకు బీపీ హెచ్చు తగ్గులు అవుతుండడంతో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమె మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన సూరమ్మ అని తెలిసింది.



సీఎంకు నటరాజన్ విగ్రహాన్ని బహూకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న సీఎం



సభా ప్రాంగణంలో కళాకారుల ఆటాపాట

సభ జరిగిందిలా..

తుర్కపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిర్మలాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాపాలన' సభ విజయవంతమైంది. నాయకులు రెండు రోజులు శ్రమించి ప్రజలను పెద్ద సంఖ్యలో సభకు తరలించారు. ప్రతీ గ్రామం నుంచి ప్రజలు వచ్చేలా ప్రైవేట్, ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసారు. సభకు అధికంగా మహిళలే హాజరయ్యారు. ఉదయం నుంచే కలెక్టర్ హనుమంతరావు సభా స్థలికి చేరుకొని ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 12గంటల నుంచే సభకు ప్రజల రాక ప్రారంభమైంది. ప్రజలకు మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు పంపిణీచేశారు. ప్రభుత్వ పథకాలు, ప్రజాపాలనపై కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించారు. ట్రాఫిక్ పోలీస్‌ల ఆంక్షలతో సభా ప్రాంగణానికి అర కిలోమీటరు దూరంలోనే వాహనాలను పార్క్‌చేయగా, ప్రజలు అక్కడి నుంచి కాలి నడకన సభకు వచ్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు రావడంతో మీడియా కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీల్లోకి సైతం వారిని పోలీస్‌లు అనుమతించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి హెలీకాప్టర్‌లో సభకు వచ్చారు. మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి రోడ్డుమార్గంలో సభకు చేరుకున్నారు. వీరితో పాటు ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, శంకర్‌నాయక్, శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా కార్యకర్తలు పావు గంటపాటు ఉత్సాహంగా టపాసులు పేల్చారు. సభ ముగిసిన అనంతరం ప్రజలు ఒకేసారి తిరుగు ప్రయాణంకావడంతో మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పోలీస్‌లు సకాలంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సీఎం సభ సైడ్ లైట్స్

- 12.00గంటలకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభకు ప్రజల రాక ప్రారంభమైంది.
- 3.39గంటలకు ప్రజలతో సభా ప్రాంగణం నిండింది.
- 3.49గంటలకు సభా వేదికపైకి మంత్రి సీతక్క చేరుకున్నారు.
- సాయంత్రం 4.08గంటలకు తిర్మలాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో చేరుకున్నారు.
- 4.17గంటలకు యాదగిరనిగుట్ట దేవస్థానం వేదపండితులు సీఎంకు వేద ఆశీర్వచనం చేశారు.
- 4.19గంటలకు వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.
- 4.21గంటలకు 'ప్రజాపాలన' సభా స్థలికి సీఎం చేరుకొని ప్రజలకు అభివాదం చేశారు.
- 4.23గంటలకు సీఎం జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రాష్ట్ర గీతాన్ని ఆలపించారు.
- 4.27 నుంచి 4.53గంటల వరకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య 26 నిమిషాలు ప్రసంగించారు.
- 4.54 నుంచి 4.58గంటల వరకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నాలుగు నిమిషాలు ప్రసగించారు.
- 4.59 నుంచి 5.06గంటలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏడు నిమిషాలు ప్రసంగించారు.
- 5.07 నుంచి 5.25గంటల వరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 18 నిమిషాలు ప్రసంగించారు.
- 5.27 నుంచి 6.03గంటల వరకు సీఎం రేవంత్‌రెడ్డి 36 నిమిషాలు ప్రసంగించారు.
- 6.07గంటలకు సభా ప్రాంగణానికి వెనుక ఉన్న హెలీప్యాడ్‌కు సీఎం చేరుకున్నారు.
- 6.17గంటలకు సీఎం హెలీకాప్టర్ హైదరాబాద్‌కు బయలుదేరింది.



తుర్కపల్లి మండలం తిరుమలాపూర్‌లో సభకు హాజరైన మహిళా కార్యకర్తలు

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన

● నృసింహుడి సేవలో మంత్రి రాజనర్సింహ

యాదగిరిగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి శుక్రవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింజేశారు. వేద మంత్రాలు మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమనరీతిలో గంటపాటు పూజాపర్వం కొనసాగింది. సువర్ణ పుష్పార్చన, ఊంజలి సేవోత్సవాలు లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. నిత్య కల్యాణం, సుదర్శన హోమం సంప్రదాయ రీతిలో కొనసాగాయి. సాయంత్రం ఊంజల్ సూవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సాంప్రదాయంగా కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వత వర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు , యాగశాలలో చండీహోమం శైవనాగ పద్ధతిలో చేపట్టారు.



లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

ప్రముఖుల సందర్శన..



మంత్రి దామోదర రాజనర్సింహకు లక్ష్మీనృసింహుల చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు

యాదగిరీశుని శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోధర రాజనర్సింహ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో మంత్రికి ఈవో తో పాటుగా పూజారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో పండితులు వేదాశీర్వచనం చేయగా వారికి లడ్డు ప్రసాదాలు స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ ఈవో అందజేశారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.60 అడుగులు
టీఎంసీలు	134.4032
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	450 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	23.03 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.10 అడుగులు
టీఎంసీలు	3.27
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	222. 56క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	76.40 క్యూసెక్కులు

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ డ్రైనేజీ నీటికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షపు నీరుతోడై నెల రోజులుగా వాగులు, వంకల నుంచి క్రమం తప్పకుండా వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. దీంతో వానాకాలం ప్రారంభంలోనే ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టానికి చేరువలోకి వచ్చింది.

20శాతమే పూర్తి

(5వ పేజీ తరువాయి)

విస్తరణా అధికారుల వద్ద నమోదు చేసుకోవాలి. అనంతరం లబ్ధిదారులకు ఓటీపీ వస్తుంది. దాన్ని ధ్రువీకరించాక రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. ఈ సంఖ్యను కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అనుసంధానం చేస్తారు. పీఎం కిసాన్‌లో వచ్చే విడత వారీ నిధులకు ఈ గుర్తింపు కార్డును కేంద్ర ప్రభుత్వం ప్రమాణికంగా తీసుకోనుంది. అయితే ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాలో సుమారు 90వేల మంది రైతుల వివరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయినట్లు సమాచారం. అదేవిధంగా యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో కలిపి సుమారు 1.25లక్షల ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిసింది.

వివరాల డిజిటలైజేషన్‌కు సమస్యలే

గతంలో అధికార యంత్రాంగం రైతుల వివరాలను డిజిటలైజ్ చేయడం పెద్ద సమస్యగా ఉండేది. ఆ సమస్యలు తొలగుతాయని ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ సందర్భంగా భావించినా, తిరిగి అవే సమస్యలు ఎదురవుతున్నాయి. గతంలో మాదిరిగానే సమస్యలు ఉండటంతో వ్యవసాయ అధికారులకు వివరాల నమోదు ఇబ్బందిగా మారింది. పాస్‌పుస్తకాలు, ఆయా గ్రామాలకు సంబంధించిన వివరాలు, ఆధార్‌లోని అడ్రస్‌తో సరిపోలకపోవడంతో తిరస్కరణకు గురవుతున్నాయి. సాంకేతిక సమస్యలు ఈ ప్రక్రియకు ఆటంకంగా మారాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌లు అతి తక్కువ సంఖ్యలో నమోదవుతున్నాయి. ఆధార్‌కార్డు, భూమి పాస్‌బుక్‌లోని చిరునామాలు వేర్వేరుగా ఉండటంతో సమస్య తీవ్రమైంది. గ్రామాల్లో భూములు ఉన్న వారు పట్టణ ప్రాంతాలల్లో నివసిస్తూ వారి అడ్రస్ మార్చుకున్నారు. దీంతో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ వ్యయ ప్రయాసగా మారింది. కేంద్ర ప్రభుత్వం అన్ని సమస్యలకు పరిష్కారంగా విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక కార్డులు జారీ చేయాలని నిర్ణయించినా ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. గతంలోనే కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాల్లో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేపట్టగా, తెలంగాణలో మాత్రం వాయిదా పడింది. అయితే గత నెలలో అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఈ పథకాలకు రాష్ట్రంలో అమలయ్యే రైతుభరోసా, రుణ మాఫీ ప్రక్రియలకు ఎలాంటి సంబంధ లేదని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు. రెవెన్యూశాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలే ప్రమాణికంగా ఉంటాయని వ్యవసాయశాఖ పేర్కొంది. మొత్తానికి విశిష్ట కార్డులు అందుబాటులోకి రానుండటంతో సమస్యలు తొలగిపోయే అవకాశాలు ఉన్నాయని అనుకున్నా, నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులతో ఆదిలోనే ఆంటకం ఏర్పడుతోంది. త్వరితగతిన విశిష్ట గుర్తింపుకార్డులను అందజేసేలా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నా ప్రక్రియ ముందు పడటం లేదు.

రుణాల పంపిణీకి సులభతర పాలసీ

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణాల పంపిణీ కోసం సులభతర పాలసీని రూపొందించినట్లు డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార బ్యాంక్ అంటేనే రైతుల బ్యాంకు అని, రైతుల అభివృద్ధికి డీసీసీబీ ఎల్లప్పుడు సహాయసహకారాలు అందిస్తుందన్నారు. బ్యాంకు నుంచి రుణం పొందిన వారు ఏ కారణం చేతనైనా మృతిచెందితే ఓటీఎస్ సౌకర్యం కల్పించేందుకు తీర్మానం చేశామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంటల వారీగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు గొంగిడి మహేందర్‌రెడ్డి, పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, కొండా సైదులు, అందేం లింగం యాదవ్, ఇరిగినేని అంజయ్య, సీఈవో శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఎండీ సజ్జనార్ అభినందన

దేవరకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులు పొగొట్టుకున్న ఫోన్‌లు, వస్తువులను నిజాయితీగా తిరిగి వారికి అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను హైదరాబాద్ బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండి.సజ్జనార్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈనెల 2న దేవరకొండ బస్‌స్టేషన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్లకు చెందిన ప్రయాణికుడు రూ.30వేల విలువగల ఫోన్‌ను పొగొట్టుకున్నాడు. బస్‌స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న అందుగుల ముత్తమ్మకు ఫోన్ దొరకగా నిజాయితీగా డిపో అధికారులకు అందజేసింది. అట్టి విషయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా ఆర్టీసీ ఎండి.సజ్జనార్ తెలుసుకున్నారు. దేవరకొండ డిపోలో స్వీపర్‌గా పనిచేస్తున్న అందుగుల ముత్తమ్మను డిపో అసిస్టెంట్ మేనేజర్ వడాల సైదులును ఆర్టీసీ ఎండి.సజ్జనార్ శుక్రవారం ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని బస్‌భవన్‌కు పిలిపించి శాలువాతో సత్కరించి బహుమతులు అందజేసి అభినందించారు. ఆర్టీసీ డిపోను అన్ని రంగాలలో ముందంజలో ఉంచాలని సూచించారు.



హైదరాబాద్ బస్‌భవన్‌లో దేవరకొండ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సైదులు, స్వీపర్ ముత్తమ్మలను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండి.సజ్జనార్

CLASSIFIEDS

ఉమా మహేశ్వర నేపాల్ యాత్రలు

★ ఇతర దేశం, నేపాల్, ముక్తినాథ్, లూంబిని, ఖాట్మండు పశుపతి నాథ్ మందిర్, కాశి, అయోధ్య, 12 రోజులు బస్సు ప్రయాణం 35 వేల టికెట్, ప్రెజెంట్ ఆఫర్, 17500/- మాత్రమే జూన్ 25, తారీఖు యాత్ర సెల్ : 9849909422

AJY_224244

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413365 9985413656

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9985410384

నేడు నెరుసు, మెర వ్యాస సంపుటాల ఆవిష్కరణ సభ

నల్లగొండ కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య రచించిన నెరుసు, మెర సాహిత్య వ్యాస సంపుటాలు శనివారం ఆవిష్కరించనున్నట్లు సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు పెరమాళ్ల ఆనంద్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీ కళాశాల సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెరుసు పుస్తకాన్ని డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్యులు, మెర పుస్తకాన్ని మేరెడ్డి యాదగిరిరెడ్డి ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

నార్కట్‌పల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దృఢత్వం లభిస్తుందని ఎల్లారెడ్డిగూడెం మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిగూడెం లో జిల్లా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి జూడో శిక్షణ శిబిరం ముగిసింది. శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశానికి ఆయన హాజరై విద్యార్థులకు పండ్లు, బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ చెన్నయ్యగౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమాచారం

బీజేపీ మండల నూతన కమిటీ



ప్రధాన కార్యదర్శి సైదులుగౌడ్

కనగల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నూతన కమిటీని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పిండి పాపిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పులకరం భిక్షం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు పార్టీ మండలాధ్యక్షుడు పర్వనబోయిన బిక్షం శుక్రవారం నూతన కమిటీ వివరాలను వెల్లండించారు. పార్టీ ఉపాధ్యక్షులుగా పల్లెగోని సైదులు, పాలకూరి సరిత, నూనె చంద్రమోహన్ ఆరెకంటి సుజాత ప్రధాన కార్యదర్శులు పంతంగి సైదులుగౌడ్, నీలకంఠం వెంకన్న, కార్యదర్శులుగా జక్కుల నవీన్ యాదవ్, బైరగోని శేఖర్ గౌడ్, జిల్లా కల్యాణి, పాశం నాగేందర్, కోశాధికారిగా కట్ట మహేశ్వరి ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు.

హద్దులు చూపాలి

చిట్యాలరూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తాళ్లవెల్లంల గ్రామంలో పేదలకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూమి హద్దులను చూపి లబ్ధిదారులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్ కోరారు. మండలంలోని తాళ్లవెల్లంలలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న నాయబ్ తహశీల్దార్ విజయకు అశోక్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రా మంలో 293 సర్వే నెంబరులో సుమారు 150ఎకరాల విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమిలో సుమారు 100 ఎకరాలను 60మందికి నాటి ప్రభుత్వాల ఆధ్వర్యంలో భూమిని పంపిణీ చేసి పట్టాలిచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు కూడా హద్దులను నిర్ణయించి చూపకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు భూమిని సర్వే చేయించి హద్దులు చూపాలని, మిగిలిన భూమిని భూమిలేని వారికి పంపిణీ చేయాలని కోరారు. అంతేకాకుండా అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చండూరు మండలంలో విద్యాశాఖలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న బొమ్మరగోని సైదులు తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఆర్‌టీయూ మండల నాయకులు రూ.60వేలు, చండూరు జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు మరో రూ.16వేలు మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల బిక్షం, మాదగోని వెంకటేశ్వర్లు, నాయకులు నర్సింహ, పల్లి యాదగిరి, మధుమోహన్, సుధారాణి, పందుల యాదయ్య, వెంకట్ రెడ్డి, వాసంతి పాల్గొన్నారు.

సాగు పనులు ముమ్మరం

- విత్తనాలు విత్తుతున్న రైతులు
- బిజీ బిజీగా అన్నదాతలు

కేతేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జూన్ నెల ఆరంభం నుంచి అడపాదడపా వచ్చే వర్షాలకు ప్రతి ఏటా వానాకాలం సాగు పనులను రైతులు ప్రారంభించేవారు. ఇందుకు భిన్నంగా ఈ ఏడాది మే నెల చివరి వారంలో రోహిణి కార్తె ఆరంభం నుంచి తుఫాన్ ప్రభావంతో రోజుల తరబడి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రోళ్ల పగిలేలా ఎండలు కాయాల్సిన రోహిణి కార్తె కాస్త ఆరుద్ర కార్తెలాగా చల్లబడిపోయింది. మరోవైపు నిత్యం కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ భూములు పంటల సాగు అనువుగా నానిపోయాయి. దీంతో ఇప్పటికే వేసవి దుక్కులతో భూములు సిద్ధం చేసి ఉంచిన రైతాంగం పంటల ఖరీఫ్ సాగుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోహిణి కార్తెలో పంట సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందంటూ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వానాకాలం సాగు పనులకు శ్రీకారం చుట్టారు. కాడెడ్లను పసుపు, కుంకుమలతో అలంకరించి కొందరు రైతులు పత్తి సాగుకు అచ్చుతోలడం, మరికొందరు రైతులు ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కూలీలను రప్పించి పత్తి విత్తనాలు నాటడం చేశారు.



కేతేపల్లిలో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు

ఇప్పటికే వేసవి దుక్కులు దున్ని పంటల సాగుకు భూములు సిద్ధం చేసి ఉన్న రైతులు కోటి ఆశలతో పత్తి విత్తనాలు నాటారు. గతేడాది జూన్ మూడో వారంలో వర్షాలు కురవగా ఈ ఏడాది ముందుగా వచ్చిన తొలకరిని చూసి ఆనందం వ్యక్తం చేస్తూ కొందరు విత్తనాలు నాటుతుండగా మరికొంత మంది రైతులు వరి నార్లు పెంచే పనులు చేపడుతున్నారు. పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు తెచ్చి పెట్టుకుంటున్నారు. దీంతో భూములు కూలీలతో, విత్తనాల విక్రయ దుకాణాలు రైతులతో సందడిగా కనిపిస్తున్నాయి.

పత్తి సాగుకే మొగ్గుతున్న రైతులు

పత్తికి బదులుగా ఇతర వాణిజ్య పంటలు సాగు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు, అధికారుల సూచనలు రైతుల చెవికెక్కడం లేదు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పంట మార్పిడి పద్ధతిని అనుసరించాలని చేస్తున్న సూచనలను ఖాతర్ చేయకుండా మెజారిటీ రైతులు పత్తి పంటనే సాగు చేస్తున్నారు. కంది, పెసర, ఆముదం, ఆయిల్‌పాం వంటి పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు చేసిన విజ్ఞప్తులను రైతాంగం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. దీంతో ఈ ఏడాది సైతం పత్తి పంట అధిక విస్తీర్ణంలో సాగుకానుంది.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

నల్లగొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా భూ భారతి రెవిన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. ఈ చట్టం అమలులో భాగంగా ఈనెల 3 నుంచి ప్రారంభమైన సదస్సులు 20 వరకు అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తారు. ఈనెల 5 వరకు 9815కు పైగా దరఖాస్తులు అందాయి. ఈ సదస్సుల్లో సా దాబైనామాలు, పెండింగ్ మ్యూటేషన్‌లు, సక్సేషన్స్ విస్తీర్ణంలో తప్పు ఒప్పుల సవరణ, భాగాల పంపిణీ వంటి సమస్యలను పరిష్కరించనున్నారు. అత్యధికంగా సాదాబైనామాలు పెండింగ్ మ్యూటేషన్‌లు, సక్సెషన్స్ కరెక్షన్స్, భాగాల పంపిణీ, శివాయి జమేదారు, పట్టా పాస్‌బుక్‌లకు సంబంధించిన దరఖాస్తులు వస్తున్నట్లు సమాచారం. లావుణి పట్టా భూములను పట్టా చేయడం కుదరదని ఇప్పటికే స్పష్టం చేశారు.

● నార్కట్‌పల్లి: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్ రెడ్డి అన్నారు. మండలంలోని అవురవాణిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ా సదస్సులో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ తరుణ్, దొడ్డి శివశంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తిలో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

● కట్టంగూరు : మండలంలోని కల్మెర, పామనగుండ్ల గ్రామాలో రెవిన్యూ సదస్సులను నిర్వహించారు. కల్మెర గ్రామంలో 33 దరఖాస్తులు, పామనగుండ్లల 26 దరఖాస్తులు స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్‌బర్ట్ తెలిపారు.

● తిప్పర్తి : కంకణాలపల్లి, జంగారెడ్డిగూడెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె. పరుశురామ్, పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోన జానయ్య పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్ : మండలం చిన్నకాపర్తి, తాళ్లవెల్లంల గ్రామాల్లో తహసీల్దాఴ జి. కృష్ణ, నాయబ్ తహసీల్దార్ విజయ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సాదాబైనామ, రెవెన్యూ రికార్డుల్లో భూమి తమ పేరిట నమోదు కాలేదని, ఉన్న భూమి విస్తీర్ణంలో తక్కువగా నమోదైనదని, పట్టా, పేర్లు మార్పిడి కాలేదని వీటితో పాటు పలు సమస్యలపై అర్జీలు అందజేయగా వాటికి రశీదులు ఇచ్చారు. చిన్నకాపర్తిలో 131 అర్జీలు, తాళ్లవెల్లంలలో 120 అర్జీలు వచ్చాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఎలాంటి సమస్యలున్నా రెవెన్యూ సదస్సుల్లో అర్జీ పెట్టుకోవాలని వాటిని పరిశీలించి తాము పరిష్కరిస్తామని, తమ స్థాయిలో లేనటువంటి వాటిని ఆర్డీఓ, కలెక్టర్ పరిష్కరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సులను మండలంలోని గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వేయర్ రజనీకాంత్, ఆర్ఐ జానీ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జూనియర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది కృష్ణవేణి, దయాకర్, రమేష్, హరిప్రీత్‌రెడ్డి, విజయ్, ఫరీద్, నదీమ్, దయాకర్, రాంబాబు, రైతులు, భూముల యజమానులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : అవురవాణి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

కొనసాగతున్న రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

- పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- నేడు బొడ్రాయికి పూజలు



ఆలయ ఆవరణంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చిట్యాలరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలం ఉరుమడ్ల గ్రామంలో గల పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు, మహాకుంభాభిషేకం కార్యక్రమాల్లో భాగంగా 2వ రోజు పూజలు జరిగాయి. వేకువజాము నుంచి పూజాకార్యక్రమాలు ప్రారంభం కాగా గర్భగుడిలోని స్వామివారికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం నుంచి కలశాలను పురోహితులు, కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజాకార్యక్రమాల వద్దకు తీసుకువచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండప పూజ, వేదపారాయణము, మూల మంత్ర జపము, ప్రదోశ పూజ, మూలమంత్ర జప హోమము, సహస్ర కంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పము, చతుర్వేద స్వస్తి పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీన గ్రామంలోని బొడ్రాయికి పూజాకార్యక్రమాలను జరుపనున్నామని గ్రామస్తులు ప్రతి ఇంటి నుండి ఒక బిందెడు నీటిని తీసుకొచ్చి అభిషేకం కార్యక్రమంలో పాల్గొనాలని, బంధుమిత్రులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఆలయ బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ బ్రహ్మోత్సవాల్లో హోమపూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కట్టంగూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కట్టంగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావుతో కలిసి బడిబాట ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ఐక్యంగా కృషి చేయాలన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సునిత, పద్మజ, మేరి సుజాత, స్వరూపారాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ఉన్నారు.

● నార్కట్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలనే ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా పొందే లబ్ధి, ప్రైవేటు లో చేర్పించడం ద్వారా కలిగే ఆర్థిక భారం వంటి అంశాలను పేర్కొంటూ కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగే ఊరూరా బడిబాటలో భాగంగా నాయకులు బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, స్రవంతి, ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మర్రిగూడ :మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా ఎంఈవో బిట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యార్థులకు అర్థమైన రీతిలో విద్యాబోధనలు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. నేడు ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లలను చదివించాలంటే అధిక ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించినట్లయితే విద్యతో పాటు ప్రభుత్వం అందించేటటు వంటి సంక్షేమ పథకాలను కూడా పొందవచ్చునని ఆయన అన్నారు. శ్రీనివాస్, సుమతి, గ్రామ కార్యదర్శి యూసుఫ్, రాజేశ్వరి, అక్షిత, హరిజన ఉపాధ్యాయులు ఉన్నారు.

● చిట్యాలరూరల్ : మండలంలో చిన్నకాపర్తి, గుండ్రాంపల్లి గ్రామాల్లో శుక్రవారం బడిబాట నిర్వహించారు. చిన్నకాపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ జి. కృష్ణ, ఎంఈఓ పి.సైదానాయక్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని పిల్లలకు విద్యనందించేందుకు ప్రభుత్వం ఎంతో ఖర్చుతో పాఠశాల భవనాలను నిర్మించిందని అంతేకాకుండా ఖర్చుకు వెనుకాడకుండా ప్రభుత్వ ఉపాధ్యాయులకు విద్యాబోధనలపై విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రత్యేకంగా శిక్షణనిప్పిస్తుందన్నారు. బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, రఘు, మాధవి పాల్గొన్నారు.

● చండూరు రూరల్ : కొండాపురం గ్రామంలో ఎంపీ, యూపీఎస్ పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. పిల్లలతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి, గ్రామ సెంటర్లో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ముత్యాలు, ఉపాధ్యాయులు శేఖర్, భద్రయ్య, భగవంతరెడ్డి, పావని పాల్గొన్నారు



మర్రిగూడ : బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యతా పాటించాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చండూరు మునిసిపాలిటీల్లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో రూ.30కోట్లతో కొనసాగుతున్న పనులను ఆయన బైక్‌పై తిరిగి పరిశీలించారు. డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల మార్పులు చేర్పులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని గుత్తేదారుడికి సూచించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణకు దుకాణ యజమానులు సహకరించాలని కోరారు. చండూరు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేంత వరకు విశ్రమించనని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

నకిరేకల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కరస్పాండెంట్లు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు త్వరలో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీకాంత్‌రెడ్డి, కన్నయ్యగౌడ్, సరితారెడ్డి, కృష్ణా, మారుపాక నర్సయ్య, సుధాకర్, గంగరాజు, శంకర్, నాగరాజు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



సర్వారం గ్రామంలో లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న అధికారులు, నాయకులు

తిప్పర్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సర్వారం, మామిడాల, పజ్జూరు, ఇండ్లూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం ఆయన మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డితో కలిసి అందజేశారు. అదే విధంగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు పుల్లబట్ల ప్రవీణ్ కుమార్, రొట్టెల రమేష్, బద్దం సుదీర్, జాకటి మోష, పల్లె ఎల్లయ్య, శ్రీనివాస్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న రాపోలు యాదగిరి



ఆర్థిక సాయం అందజేస్తున్న రాపోలు యాదగిరి

మర్రిగూడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల నుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడిని ఆదుకొని వైద్యం కోసం రూ.లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నాడు. మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన బల్లెం యాదగిరి స్వరూప పెద్ద కుమారుడు బెల్లం ప్రవీణ్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చేసుకోవటానికి డబ్బులు లేకపోవడంతో తల్లిదండ్రులు వైద్యం కోసం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. అదే గ్రామానికి చెందిన నీలకంఠ రామలింగేశ్వరస్వామి దేవాదాయ ధర్మదాయ కమిటీ చైర్మన్ రాపోలు యాదగిరి స్పందించి శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాలుడి తల్లిదండ్రులైన యాదగిరిస్వరూపలను పిలిపించి వైద్యం కోసం లక్ష రూపాయల నగదు అందజేశారు. తన కుమారుని ప్రాణాలు రక్షించేందుకు ముందుకు వచ్చిన రాపోలు యాదగిరి చేసిన సహాయం మర్చిపోలేనని భావోద్వేగంగా వెల్లడించారు. ఆయన వెంట శ్రీరామదాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య, వెంకటేష్, జమ్మల వెంకటేష్, కుక్కడపు ముత్యాలగౌడ్, బంగారం ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం



అమ్మగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్

కనగల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతిల్లు కలను సాకారం చేస్తుందని మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని అమ్మగూడెం, కనగల్, తిమ్మాజీగూడెం గ్రామాల్లో పేదలకు మంజూరైన ఇందిర ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదన్నారు. డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాన్ని గాలి వదిలేయటంతో పేదలకు సొంతింటి కల అందని ద్రాక్షగానే మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందని అన్నారు. తొలి విడతగా అత్యంత నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షలు ఇవ్వటం అభినందనీయమన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మందడి రాంచంద్రారెడ్డి, ఎంపీడీవో జయరాం కార్యదర్శి వీరబాబు, మాజీ సర్పంచులు నర్సింగ్ సునీతాకృష్ణగౌడ్, పందుల గోపాలు నాయకులు హఫీజుద్దీన్, పగిడిపాటి సత్తయ్య, పెరిక వెంకన్న, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
లైవ్	132
డ్రెస్	192
స్కిన్‌లెస్	220
గుడ్డుడజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.5
కనిష్ఠం	25.0

ఎండవేడికి
మొలకెత్తని విత్తు
- ప్రతాపం చూపుతున్న సూరీడు
- పలుచోట్ల మొలకెత్తని పత్తి విత్తనాలు

6


సభకు హాజరైన ప్రజాప్రతినిధులు

సాగునీటి ప్రాజెక్టులు
పూర్తి చేస్తాం

- ఇరిగేషన్‌కు బీఆర్ఎస్ రూ.2లక్షల కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టులు ఎందుకు పూర్తికాలేదు?
- ఆరునూరైనా మూసీ ప్రక్షాళన
- పదేళ్లలో తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- త్వరలో గుట్టకు పాలకమండలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తిర్మలాపూర్‌లో 'ప్రజాపాలన' సభ సక్సెస్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం జిల్లాలోని తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ, పదేళ్లలో గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.2లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అయితే ఉమ్మడి జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, గంధమల్ల రిజర్వాయర్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. బునాదిగాని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వల పునరుద్ధరణ చేపట్టలేదన్నారు. గంధమల్ల రిజర్వాయర్ అంచనాలు తగ్గిస్తూ గత ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. గంధమల్లకు నీరు ఎక్కడి నుంచి ఇస్తారని మాజీ మంత్రి హరీష్‌రావు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని, నిధులు ఇచ్చినవారు నీరు ఇవ్వలేరా? అని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామన్నారు. ప్రజలు సహకరిస్తే తెలంగాణను పదేళ్లలో ట్రిలియన్ ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, తెలంగాణను జపాన్, సింగపూర్ సరసన నిలుపుతామన్నారు.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వైటీడీ బోర్డు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. త్వరలోనే యాదగిరిగుట్ట ఆలయానికి కొత్తగా బోర్డు ఏర్పాటవుతుందని ప్రకటించారు. టీటీడీ తరహాలో వైటీడీ కూడా సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తరహాలో ఈ ప్రాంతంలో గొప్ప విద్యా సంస్థలను, యూనివర్సిటీని ఏర్పాటుచేస్తామని చెప్పారు. భక్తుల కోరిక మేరకు పాత సంప్రదాయాలను పునరుద్ధరించామని, గుట్టపైకి ఆటోల నిషేదాన్ని ఎత్తివేసి, ఆటోల ప్రయాణాన్ని కొనసాగించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, 18 నెలల కాలంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. 60కిలోల బంగారంతో స్వామివారి విమాన గోపురాన్ని స్వర్ణమయం చేశామన్నారు. ఎందరో త్యాగధనులు, ఉద్యమకారులు పుట్టిన చైతన్యవంతమైన ప్రాంతంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా నిలిచిందన్నారు.

మూసీ ప్రక్షాళన చేసితీరుతాం

ఆరు నూరైనా మూసీ నది ప్రక్షాళన చేసి గోదావరి జలాలతో మూసీని నింపుతామని సీఎం వెల్లడించారు. నవంబరు 8న తన జన్మదినం రోజున మూసీ ప్రక్షాళనకు పాదయాత్ర నిర్వహించి, ఈ ప్రాంత వాసుల బాధలు గమనించానన్నారు. ఆరు నూరైనా, ఎవరు అడ్డం పడినా తొక్కుకుంటూ వెళ్లి మూసీకి పునరుజ్జీవం చేసి తీరుతామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలను ప్రశ్నిస్తున్న.. పక్క రాష్ట్రాల్లో సబర్మతి, గంగా, యమునా నదులకు పునరుజ్జీవం చేస్తే..

మిగతా 7వ పేజీలో...


అభివాదం చేస్తున్న సీఎం రేవంత్


సభకు హాజరైన ప్రజలు

ఆలేరు చరిత్రలో అరుదైన ఘటన



ఆలేరు చరిత్రలో ఒకే రోజు, ఒకే దగ్గర రూ.1,500 కోట్లతో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలతో సీఎం శంకుస్థాపన చేయడం ఇది అరుదైన సంఘటన అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. స్వతంత్ర్య భారత దేశంలో 80శాతం పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం ఇచ్చిన రాష్ట్రం అది తెలంగాణ ఒక్కటేనని అన్నారు.

- భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తాం



అందరికీ అందుబాటులో ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు సహకరిస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు.

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


18 నెలల్లో చేసి చూపించాం



ఆలేరు నియోజకవర్గంలో గత పదేళ్లలో చేయని అభివృద్ధిని తమ ప్రభుత్వ హయాంలో 18 నెలల్లోనే చేసి చూపించామని, ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మంత్రులు సహకరించి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1,500కోట్ల నిధులు మంజూరు చేసి, ఆ పనులు ప్రారంభోత్సవానికి వచ్చారని, ఈసందర్భంగా అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం



ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మిగులు రాష్ట్రానికి కేసీఆర్ సీఎం అయితే, అప్పుల రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారన్నారు. అయినా సరే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ రానున్న రోజుల్లో దశల వారీగా అమలు చేస్తామన్నారు.

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

- (ఆంధ్రజ్యోతి, తుర్కపల్లి)



ప్రార్థనలకు సిద్ధమైన నల్లగొండ ఈద్గా



నేడు బక్రీద్

సామూహిక ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబు

నల్లగొండ కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం నిర్వహించనున్నారు. ముస్లింల సామూహిక ప్రార్థనలకు మునుగోడు రోడ్డులోని ఈద్గా వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. ఆ ప్రాంతమంతా శుభ్రం చేసి చదును చేశారు. తాగునీరు, ఇతర వసతులు కల్పించారు. షామియానాలు ఏర్పాటుచేశారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు రానుండటంతో పోలీసు భద్రతను ఏర్పాటు చేయనున్నారు. మునుగోడు రోడ్డులోని ఈద్గా వద్ద శనివారం ఉదయం 8.30గంటలకు సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి.

ఖుర్బాని.. మార్కెట్‌లో గొర్రెలకు గిరాకీ



బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు స్థోమతకు తగినట్టుగా ఖుర్బాని ఇస్తారు. గొర్రె, మేక, లేదా ఒంటె (ఖుర్బాని) మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి అందులో మొదటి భాగం పేదలకు, రెండో భాగం బంధువులకు, మూడో భాగం ఖుర్బాని ఇచ్చే వారు తీసుకుంటారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు ఇంటికి చేరాక ఖుర్బాని ఇస్తారు. అయితే ఖుర్బాని నేపథ్యంలో జిల్లా కేంద్రంలో గొర్రెల విక్రయాలు ముమ్మరంగా సాగాయి. పట్టణంలోని దేవరకొండరోడ్డు, మాన్యంచెల్క, ప్రకాశంబజార్ తదితర ప్రాంతాల్లో గొర్రెల విక్రయాలు అధికంగా జరిగాయి. వ్యాపారులు గొర్రెల మందలను మార్కెట్‌కు గుంపులుగా తీసుకొచ్చి విక్రయించారు. సైజును బట్టి ఒక్కో గొర్రెకు రూ.10వేల నుంచి రూ.14వేల వరకు విక్రయించారు. గొర్రెల విక్రయాలు, ముస్లింల పండుగ షాపింగ్‌తో పట్టణంలోని పలు ప్రాంతాల్లో సందడి నెలకొంది.

కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకువచ్చిన ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్‌లో పలు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. గత నెల మొదటి వారంలో ప్రారంభమైన విశిష్ట గుర్తింపు కార్డు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. భూములు ఉన్న గ్రామాల్లో ఆధార్‌కార్డ్ చిరునామా లేకుంటే ఆ వివరాల ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. దీంతో వ్యవసాయశాఖ అధికారులకు పాస్‌బుక్‌తో పాటు ఆధార్‌కార్డు, చిరునామా ఇతర వివరాల నమోదు కష్టతరంగా మారింది. రిజిస్ట్రేషన్‌లో తలెత్తుతున్న సమస్యల కారణంగా రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)


వార్కటపల్లి మండలం అమ్మనబోలు రైతు వేదికలో వివరాలు నమోదుచేస్తున్న వ్యవసాయాధికారులు

20 శాతమే పూర్తి

- ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్‌లో సాంకేతిక సమస్యలు
- వివరాల నమోదుకు ఇబ్బందులు
- ఆధార్ అడ్రస్ ఇతర ప్రాంతాల్లో ఉంటే తిరస్కరణ
- ఇప్పటివరకు 2.15లక్ష మంది రైతుల వివరాలే నమోదు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు జారీచేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. తొలుత నెల రోజుల పాటు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపట్టనుండగా, ఆ తరువాత మీ-సేవా కేంద్రాలు, ఏజెన్సీల ద్వారా దీన్ని కొనసాగించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు ఈ గుర్తింపు కార్డు ఇకపై ప్రామాణికం కానుంది. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 140కి పైగా రైతువేదికల్లో ఈ కార్యక్రమం నెలరోజుల కు పైగా కొనసాగనుంది. ఆధార్ సంఖ్యతో అనుసంధానమైన పట్టాదారు పాస్‌పుస్తకంలోని భూ యాజమాన్య వివరాల నమోదు ద్వారా రైతులకు 11 అంకెలతో ఉన్న గుర్తింపు కార్డును కేటాయిస్తారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలైన పీఎం కిసాన్‌తో పాటు పంటలబీమా, మౌలిక సదుపాయాల కల్పన వంటి పథకాలకు ఈ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారు. ఇప్పటి వరకు సరైన ధ్రువీకరణ పత్రాల వివరాల నమోదులేకపోవడంతో రైతులకు సకాలంలో కేంద్ర పథకాలు అందడం లేదని గుర్తించిన ప్రభుత్వం విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10.27లక్షలకు పైగా రైతులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10,27,532 మంది రైతులు ఉన్నారు. అందులో నల్లగొండ జిల్లాలో 5.40లక్షలు, యాదాద్రి జిల్లాలో 1,57,206మంది, సూర్యాపేట జిల్లాలో 3,30,326మంది రైతులు ఉన్నారు. వీరందరికీ విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉంది. అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈ కార్యక్రమంపై శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. విశిష్ట గుర్తింపు కార్డు జారీకి భూ యాజమాన్య పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో మండల వ్యవసాయ అధికారులు లేదా మండల వ్యవసాయ...

- మిగతా 7వ పేజీలో...

సాంకేతిక సమస్యలు పరిష్కరించాం



భూములు ఒక చోట, ఆధార్ కార్డు అడ్రస్ మరో చోట ఉండటంతో సాంకేతిక సమస్యలు ఏర్పడిన విషయం వాస్తవమే. అయితే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశాం. కొన్ని టెక్నికల్ సమస్యలను పరిష్కరించడంతో మళ్లీ రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమయ్యాయి. రైతులు విధిగా ఈ విశిష్ట సంఖ్యకు పేర్లను నమోదు చేసుకోవాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేయడం జరుగుతోంది. ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు కేటాయించడం జరుగుతుంది. ఈ గుర్తింపు కార్డు కేంద్ర ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం అవుతుంది.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

నేడు బోనాల సమర్పణ

కనగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవ, లలిత సహస్రనామార్చన, బాలబోగ నివేదన నిర్వహించారు. ఆలయాన్ని తోరణాలు, అమ్మవారిని, జమదగ్ని మహర్షి స్వామివారిని బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి వేదికపై అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని యాజ్ఞికులు డేరం భాస్కర శర్మ, అర్చకులు మల్లాచారి, శ్రవణ్‌చార్యులు, ఉమామహేష్, దామోదర్‌రావు నిర్వహించారు. అమ్మవారికి కల్యాణ తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఎండోమెంట్ ఏసీ భాస్కర్, చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి దంపతులు, ఈవో జయరామయ్య అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించి పులకించారు. భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. కల్యాణం సందర్భంగా ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ విష్ణుమూర్తి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అమ్మవారి కల్యాణం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాగా, శనివారం దర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్థులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. కార్యక్రమాల్లో తహసీల్దారు పద్మ, డీటీ పార్వతమ్మ, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మధు, కాంగ్రెస్ నాయకులు గుమ్ముల మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, పెంటయ్య, నల్లబోతు శ్రీను, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, దేప సరిత, ఆలయ సిబ్బంది జి.చంద్రయ్య, నాగేశ్వర్‌రావు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

రైతు సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కేతేపల్లి, శాలిగౌరారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రైతుల భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కేతేపల్లి మండలం భీమారం, శాలిగౌరారం మండలం వంగమర్తిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూభారతి చట్టంతో అన్ని రకాల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

మిస్సింగ్ సర్వే నెంబర్లు, మరొకరి పేరున భూమి నమోదవడం వంటి సమస్యలు ఉంటే రైతులు నిర్ణీత ఫార్మాట్‌లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో కేతేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ సత్తార్, పంచాయతీ కార్యదర్శి అనిల్, రెవెన్యూ సిబ్బంది ఆనంద్, అశ్విని, సంధ్య, విజయ్, కాంగ్రెస్ నాయకులు బడుగుల నరేందర్, శాలిగౌరారం తహసీల్దార్ పి.యాదగిరి, ఆర్ఐ మహ్మద్ అజహారుద్దీన్, సిబ్బంది పద్మ, రాంరెడ్డి, రాంబాబు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


భీమారం రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా
పూర్తి చేయాలి
కలెక్టర్ ఇలా త్రిపాఠి


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), గుర్రంపోడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం గుడిపల్లి మండలంలోని కేశంనేనిపల్లి, గుర్రంపోడు మండలంలోని జూనూతులలో ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేశంనేనిపల్లిలో లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎంత ఖర్చయింది? సామగ్రి ఎక్కడి నుంచి తెస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కేశంనేనిపల్లిలో పైలెట్ ప్రాజెక్టుగా 98 ఇళ్లు మంజూరు కాగా, అందులో 42 మంది బేస్‌మెంట్ లెవెల్ పూర్తిచేయడంతో ఐదుగురికి రూ.లక్ష వారి బ్యాంక్ ఖాతాలో జమైందని, మిగిలిన వారికి త్వరలో డబ్బు జమ అవుతుందని తెలిపారు. మిగిలిన 56 మంది లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని ఘనిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూభారతి సదస్సుకు హాజరై మాట్లాడారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్డీవో రమణారెడ్డి, డీఈ నగేందర్, ఎంపీడీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల
నమోదును పెంచాలి
డీఈవో బొల్లారం భిక్షపతి


దర్వేశిపురంలో బడిబాట ర్యాలీలో పాల్గొన్న డీఈవో భిక్షపతి

కనగల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని దర్వేశిపురం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలు, ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తోందని ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల నమోదును పెంచేందుకు కృషి చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వి.పద్మ, హెచ్‌ఎం విజయలక్ష్మి, రాంబాబు, కార్యదర్శి డి.పద్మ, పాల్గొన్నారు.

'శ్రామికవర్గాన్ని అణగదొక్కేందుకు బీజేపీ కుట్ర'

మర్రిగూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పారిశ్రామికవర్గాలకు కొమ్ముకాస్తూ శ్రామికవర్గాలను అణగదొక్కే కుట్ర చేస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభ, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను తుదముట్టిస్తోందని, ఎన్‌కౌంటర్ మృతదేహాలను కనీసం కుటుంబ సభ్యులకు అప్పజెప్పకపోవడం బాధాకరమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అవినీతికి పాల్పడి ప్రజాధనాన్ని దోచుకుతిన్నదని ఆరోపించారు. ప్రజలను పక్కదోవ పట్టించేందుకే కేసీఆర్, కవిత డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కాగా, పార్టీలో భిన్నాభిప్రాయాల మేరకు మండల కార్యదర్శి ఎన్నికను వాయిదా వేశారు. సమావేశంలో బూడిద సురేష్, ఆకుల రఘుమయ్య, అంజయ్య, నజీర్, పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ***

మిర్యాలగూడ

నాగార్జునసాగర్, దేవరకొండ

8 www.andhrajyothy.com ● శనివారం 7 జూన్ 2025

సమాచారం



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

సీతారామస్వామి ఆశీస్సులు పొందాలి

చందంపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సీతారాములస్వామి ఆశీస్సులు పొందాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండలంలోని తెల్‌దేవరపల్లి గ్రామంలో సీతారాముల ఆలయం, శివాలయం, ఆంజనేయస్వామి నూతన ఆలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో శుక్రవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కోరారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మహాలక్ష్మయ్య, లోక్యానాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే బడుగుల అభ్యున్నతి

వేములపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలోనే బడుగు, బలహీనవర్గాలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందాయని మాజీ ఎంపీటీసీ నంద్యాల శ్రీరాంరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి సహకారంతో రావులపెంట గ్రామానికి చెందిన పజ్జూరి రవికి రూ.33వేలు, శీలం గోపికి రూ.28,500, పురాణం పిచ్చమ్మకు రూ.21వేల చెక్కులు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరయ్యాయి. శుక్రవారం లబ్ధిదారులకు ఆ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి మోసపూరితంగా వ్యవహరించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చందనబోయిన చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ తరి సైదులు, జిన్నె శ్రీనివాస్‌రెడ్డి, జగన్, శివారెడ్డి, శేఖర్‌రెడ్డి, సైదులు, అశోక్, బాసిద్, లింగస్వామి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కల్తీనూనె విక్రయాలు



కొండమల్లేపల్లి సంతలో విక్రయిస్తున్న లూజు నూనె

- మామిడి పచ్చడి సీజన్ కావడంతో విచ్చలవిడిగా లూజు నూనె విక్రయాలు
- ఏది అసలో, ఏది నకిలీయో తెలియని పరిస్థితి
- అయోమయంలో ప్రజల పరిస్థితి
- తనిఖీలు చేపట్టని అధికారులు

దేవరకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నూనెల ధరలు విపరీతంగా పెరగడంతో దేవరకొండ డివిజన్‌లో కల్తీ నూనె విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. మామిడికాయ పచ్చడి సీజన్ కావడంతో నూనె వ్యాపారులు లూజు నూనె పేరుతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏది నాణ్యత గల నూనెనో, ఏది నకిలీ నూనెనో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యాపారులు లూజు నూనె పేరుతో నకిలీ నూనెను విక్రయిస్తున్నారు. దేవరకొండతో పాటు కొండ మల్లేపల్లి, పీఏపల్లి, చందంపేట, చింతపల్లి, డిండి మండలాల్లో కల్తీనూనె వ్యాపారం కొనసాగుతుంది. అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో వ్యాపారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్, హాలియా, కల్వకుర్తి ప్రాంతాల నుంచి డ్రమ్ములు, క్యాన్లలో నూనెను దేవరకొండ ప్రాంతానికి తరలించి విక్రయిస్తున్నారు. దేవరకొండ, కొండమల్లేపల్లిలలో లూజు నూనె పేరుతో విక్రయాలు జరుగుతున్నాయి. కొండమల్లేపల్లి సంతలో నూనె వ్యాపారం జోరుగా సాగుతుంది.

పెరిగిన నూనె విక్రయాలు

మామిడికాయ పచ్చడి సీజన్ కావడంతో నూనె విక్రయాలు పెరిగాయి. కిలో నూనె రూ.150 నుంచి 160 వరకు విక్రయిస్తున్నారు. లూజు నూనె రూ.130 నుంచి 140 వరకు విక్రయిస్తున్నారు. కొండమల్లేపల్లి, దేవరకొండలో కల్తీ నూనె వ్యాపారం జోరుగా సాగుతుందని అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

కరోనా తర్వాత పెరిగిన ధరలు

కరోనా సమయంలో కిలోకు రూ.75 ఉన్న మంచి నూనె ప్యాకెట్లు ఇప్పుడు రూ.150 నుంచి 160 వరకు పెరిగింది. ఇదే ఆసరాగా చేసుకున్న కొంతమంది వ్యాపారులు లూజు నూనె పేరుతో కల్తీనూనె విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విజిలెన్స్ తూనికల కొలతలు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కల్తీనూనె విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్తీనూనెతో అనారోగ్యాల పాలవుతున్నామని, పచ్చడి పెడితే నెల రోజులు కూడా నిల్వ ఉండటం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కల్తీనూనె విక్రయిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

నూనె కొనుగోలు చేస్తే రశీదు ఇవ్వాలి



దేవరకొండలోని దుకాణాల్లో మంచి నూనె కొనుగోలు చేస్తే రశీదు ఇవ్వడం లేదు. లూజు నూనె పేరుతో కల్తీ జరుగుతుంది. పట్టించుకునేవారే లేరు. నాణ్యమైన నూనె అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి. కల్తీ నూనె విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

- జహీర్, దేవరకొండ

కల్తీ నూనె విక్రయిస్తే చర్యలు

కల్తీనూనె విక్రయిస్తే తనిఖీలు నిర్వహించి వారిపై చర్యలు తీసుకుంటాం. విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేయాలి. కల్తీనూనె విక్రయాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేసి చర్యలు చేపడుతాం. వినియోగదారులు సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలి.

- రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

చింతపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి టీచర్లందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుగుణ పార్వతి తెలిపారు. శుక్రవారం చింతపల్లి, వెంకటేశ్వరనగర్ (మాల్) 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూకేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించి, ఆట-పాటలతో పాటు బొమ్మలతో బోధించాలని సూచించారు. టీచర్లు సమయ పాలన పాటించి విధులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ఈ ర్యాలీలో టీచర్లు బాదేపల్లి స్వప్న, పారిజాత, మెయినుద్దీన్, బక్కమ్మ, బాదేపల్లి ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల మహాసభ

వేములపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పుట్టల రాములు ప్రాంగణంలో శనివారం సీపీఐ మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఐ మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కార్యకర్తలు, కర్షకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమాజ సేవే లక్ష్యం

- మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు
- దేవరకొండలో అంబులెన్స్ ప్రారంభం



దేవరకొండలో అంబులెన్స్ సేవను ప్రారంభించి మాట్లాడుతున్న మంచు విష్ణు

దేవరకొండ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు, నటుడు మంచు విష్ణు తెలిపారు. తన సొంత నిధులతో ఏర్పాటుచేసిన ఉచిత అంబులెన్స్ సేవను శుక్రవారం దేవరకొండలో నటుడు శివబాలాజీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విష్ణు మాట్లాడుతూ మానవుని ప్రాణం ఎంతో విలువైనదని, అత్యవసర సమయంలో ప్రాణాన్ని కాపాడేందుకు అంబులెన్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవరకొండ ప్రాంతానికి చెందిన క్రైస్తవ జనసమితి అధ్యక్షుడు డాక్టర్ మాసారం ప్రేమ్‌కుమార్ తనను కలిసి దేవరకొండ గిరిజన ప్రాంతమని, ఉచితంగా అంబులెన్స్‌ను అందజేయాలని కోరటంతో అంబులెన్స్‌ను అందజేసినట్లు తెలిపారు. క్రైస్తవ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతానికి నటుడు మంచు విష్ణు ఉచితంగా అంబులెన్స్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం మంచు విష్ణు, శివబాలాజీలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ జనసమితి కార్యదర్శి కిష్టపర్, నాయకులు ఆలంపల్లి నర్సింహ, ప్రసన్నకుమార్, గుండాల వెంకటేష్‌యాదవ్, క్రైస్తవ జనసమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మా అధ్యక్షుడు మంచు విష్ణు, నటుడు శివబాలాజీ

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కర్నాటి లింగారెడ్డి

పెద్దవూర, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో రూ.12.78 లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అదేవిధంగా పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రైతు సహకార సంఘం మాజీ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పబ్బు గిరి, ఉపేందర్‌రెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్‌ను జాతిపితగా గుర్తించాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సర్‌ను జాతిపితగా గుర్తించాలని విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు సిరసనగండ్ల ఈశ్వరాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త అయిన జయశంకర్ అందించిన సేవలు ఎనలేనివన్నారు. సామాజిక కార్యకర్త, విద్యావేత్త అయిన జయశంకర్ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అలుపెరగని విధంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన్ను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని, జాతిపితగా గుర్తిస్తే తెలంగాణ జాతి హర్షిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చేర్యాల వెంకటాచారి, ఇనుగుర్తి గోవర్ధనాచారి, కొండోజు మల్లిఖార్జున్, తాడోజు శ్రీనివాసాచారి, దాసోజు కాంతాచారి, రామాచారి, హనుమాచారి, పిచ్చయ్య, భీష్మాచారి పాల్గొన్నారు.

'భూభారతి'తో భూసమస్యల పరిష్కారం



కొండమల్లేపల్లి : దోనియాల గ్రామంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

కొండమల్లేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులో భూసమస్యలన్నీ పరిష్కారమవుతాయని, గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. మండలంలోని వర్ధమానిగూడెం, దోనియాల గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలకు సంబంధించి సరైన ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే ఆ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రెండు గ్రామాలకు కలిపి 10 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. సదస్సులో డీటీ ప్రశాంత్, ఆర్ఐ శ్రీనివాస్, ఎస్ఏ దయాకర్‌రెడ్డి, జేఏ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● దేవరకొండ: పట్టణ శివారులోని రైతుభవన్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. సదస్సులో దేవరకొండ పట్టణానికి సంబంధించి 27, ముదిగొండ గ్రామానికి చెందిన 16 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. దేవరకొండలో వక్ఫ్‌బోర్డు భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. సర్వే నెంబర్లు, పేరు మార్పులపై దరఖాస్తులు వచ్చినట్లు, పరిశీలించి భూభారతి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ సదస్సులో దేవరకొండ ఎంపీడీవో డానియెల్, ఆర్ఐ కర్నాకర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

● చింతపల్లి: మండలంలోని కుర్మేడ్, హోమంతాలపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ మాట్లాడారు. భూసమస్యల పరిష్కరించి, రైతుల సంక్షేమానికి భూభారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రెండు గ్రామాల్లో కలిసి 38 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు.



దేవరకొండ: పెంచికల్‌పహాడ్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్

అవసరం మేరకు ఎరువులు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

హాలియా, జూన్ 6(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగానే అవసరం మేరకు ఎరువులు వేసుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరమ్య, స్వాతి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయా పాలిటెక్నిక్ కంపసాగర్ అసిస్టెంట్ ప్రొఫెసర బృందం అనుముల మండలం హజారీగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలని, అవసరం మేరకు రసాయాలను వినియోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడవచ్చని, రశీదులను భద్ర పరుచుకుంటే కష్ట కాలంలో నష్టపరిహారాన్ని పొందవచ్చని అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలను వాడాలని, ఆరుతడి పంటలు వేసుకోవాలని, వేపగింజల కాషాయం తయారీ వాడకం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో సరిత, ఉద్యానవన అధికారి మురళి, వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్, లిఖిత్, సుజాత, మధుసూదన్, రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలను ఎమ్మార్పీకే విక్రయించాలి



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

హాలియా, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విత్తన డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరకు మాత్రమే విక్రయించాలని టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. అనుముల మండలంలోని పలు విత్తన డీలర్ల దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తన స్టాకు, స్టాకు రిజిస్టర్, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్, లైసెన్స్, స్టాక్ బోర్డు, ధరల పట్టిలు మొదలైన అంశాలపై తనిఖీలు నిర్వహించి వాటిని సక్రమంగా మెయింటెన్ చేయాలని సూచించారు. విత్తనాలను ఎమ్మార్పీ కంటే అధిక ధకు విక్రయిస్తే వారిపై విత్తన యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట ఏవో సరిత, వ్యవసాయ సిబ్బంది, విత్తన డీలర్లు ఉన్నారు.

సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

- ప్రజాభవన్ ఎదుట ఆందోళన



ప్రజాభవన్‌లో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

చింతపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ఎదుట చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయడానికి 8 ఎకరాల భూమి కేటాయించిందని అన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, తెనాలి, బాపట్ల, నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నంలో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సందుపట్ల రాముసాగర్, లక్ష్మణ్‌సాగర్, చీర ఐలయ్య, లావణ్య, స్వప్న, మహేష్, లక్ష్మణ్, విద్యార్థులు సాకేత్‌సాగర్, అభినవ్, గౌతమ్, అశ్విని, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూములు సర్వే చేయాలి

- రెవెన్యూ సదస్సును అడ్డుకున్న గ్రామస్థులు



కొప్పోలులో ఆందోళన చేస్తున్న రైతులు

గుర్రంపోడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దేవాలయ భూములకు సర్వే చేసి హద్దు రాళ్లు పాతాలని గ్రామస్థులు రెవెన్యూ సదస్సును అడ్డుకున్నారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆలయ భూముల సర్వే నిర్వహిస్తామని మార్చి 21వ తేదీన చెప్పి రాజకీయ ఒత్తిడిలకు లోనై సర్వే నిలిపివేశారని ఆరోపించారు. దేవాలయ భూముల సర్వేపై అధికారులు వైఖరి ఏమిటో తెలిపే వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించవద్దని ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆందోళనకారులతో ఆర్డీవో రమణారెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. సోమవారం నోటీసులు జారీ చేసి వారంలో సర్వే చేపడతామని ఆర్డీవో హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఐతగోని పరమేష్, తిరుగుడు లింగారెడ్డి, కృష్ణగౌడ్, లక్ష్మీనారాయణ, కొత్త నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



దేవరకొండ : మైనంపల్లిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న టీచర్లు, నాయకులు

దామరచర్ల, చందంపేట, దేవరకొండ, వేములపల్లి, కొండమల్లేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని దామరచర్ల, చందంపేట ఎంఈవోలు బాలాజీనాయక్, చందర్‌నాయక్ పలు పాఠశాలల హెచ్‌ఎంలు అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని పలు గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు ఉచిత భోజనం, యూనిఫాం, నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

● దామరచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు షఫి, విజయ్, ధర్మనాయక్, రవీందర్, సురేందర్, నెహ్రూ పాల్గొన్నారు.

● చందంపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో చందర్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ఉత్తమ ఉపాధ్యాయులతో విద్యా బోధన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● దేవరకొండ: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని మైనంపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కొర్రగౌతమిరాంసింగ్ అన్నారు. మైనంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, అంగన్‌వాడీ టీచర్ కమలమ్మ, ఆశావర్కర్ విజయ, ధనమ్మ, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వేములపల్లి మండల కేంద్రంలో వేములపల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్ మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోవద్దని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతుల ద్వారా విద్యాబోధన అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేజీబీవీ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో వసంతకుమారి, టీచర్లు సుధాకర్, రమణారెడ్డి, ప్రభాకర్, సైదులు, యాదమ్మ, వెంకట్‌రెడ్డి, శాంతకుమారి, వాణిశ్రీ, నాగశ్రీ, నాగమణి, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, నాయకులు పుట్టల కృపయ్య, నాగవెల్లి మధు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డాకునాయక్, కేజీబీవీ ఎస్‌వో సరళ, హెచ్‌ఎంలు ఉదయ, టీచర్లు మల్లెల జనార్దన్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాసులు, బక్క శ్రీనివాస్‌చారి, శివప్రసాద్‌రెడ్డి, జానునాయక్, సైదానాయక్, అశోక్, బాలాజీ, నర్సింహ, యాదయ్య, అంజయ్య, బాబు, శ్రీనునాయక్, నీరజ, సరస్వతి, సైదులు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : భైరవం / వెంకటేశ్వర: థగ్ లైఫ్ / రాఘవ: బద్మాషులు, శ్రీశ్రీశ్రీ రాజావారు / విట్రోస్: థగ్‌లైఫ్, భైరవం, దేవరకొండ : మనోజ్ : భైరవం / మైత్రి వెంకటేశ్వర : కరాటే కిడ్